క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో మిలాద్ పఠనం



మిలాద్ పఠనంలో పాల్గొన్న ముస్లింలు

ఉరవకొండ: స్థానిక జామాలుద్దీన్ ఖాద్రీ దర్గా ఆవరణలో ఉన్న అసార్ కట్ట వద్ద ముస్లిం ప్రవక్త జన్మదినం సందర్భంగా ముస్లింలు భక్తి శ్రద్ధలతో జరుపుకొనే మిలాద్ ఉన్ నబీ వేడుకల్లో భాగంగా ఈ నెల 16న మిలాద్ పఠనం ప్రారంభించారు. పవిత్రమైన శుక్రవారం రోజు మిలాద్ పఠనంలో భారీగా ముస్లిం సోదరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవిత్ర ఖురాన్ పఠనంతో పాటు మహ్మద్ ప్రవక్త గీతాలు ఆలపించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈనెల 28న మిలాద్ ఉన్ నబీ పండుగ సందర్భంగా మిలాద్ పఠనం ఈ నెల 27 వరకూ కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 28న జరిగే మిలాద్ ఉన్ నబి జెండా ఊరేగింపులో దుకాణాలు మూసివేసి వ్యాపారులు పాల్గొనాలన్నారు.

రీ-సర్వేకు సహకరించండి



హంసాయపల్లిలో రీసర్వే చేస్తున్న దృశ్యం

కూడేరు: రీ సర్వేకి రైతులంతా సహకరించాలని తహసీల్దార్ శేషారెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని కొర్రకోడు పంచాయతీ హంసాయపల్లి, పీఏబీఆర్ డ్యాం గ్రామాల్లో రీ సర్వే కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ రీ సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. భూములకు సంబంధించి డిజిటల్ రికార్డులను తయారు చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్వేయర్లు హేమచంద్రారెడ్డి, వన్నూరుస్వామి, వీఆర్వో నాగన్న, వీఆర్ఏ ఓబుళపతి, రైతులు పాల్గొన్నారు.

వజ్రకరూరు: మండలంలోని పొట్టిపాడు, రాగులపాడు, చిన్నహోతూరు, గంజికుంట, గూళ్యపాళ్యం గ్రామాల్లో రీసర్వే వేగవంతంగా సాగుతోంది. శుక్రవారం మండలంలోని పొట్టిపాడులో జరుగుతున్న రీసర్వేను ఇన్‌చార్జ్ తహసీల్దార్ కేశవరెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో వీఆర్వో సురేంద్ర, సచివాలయ సర్వేయర్ లోకేష్, రీసర్వే సిబ్బంది పాల్గొన్నారు.

'ఫ్యామిలీ డాక్టర్' పేదలకు వరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం పేదలకు వరమని, శ్రీధరఘట్ట పీహెచ్‌సీ వైద్యాధికారులు మల్లీశ్వరి, కుమారరాజా అన్నారు. శుక్రవారం మండలంలోని సింగానహళ్లిలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఆమె రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు అందించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవం తల్లీబిడ్డకు శ్రేయస్కరమన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఉమాదేవి, ఆరోగ్య కార్యకర్తలు, వెంకటరమణ, ఈశ్వరమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ గౌతమి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నారాయణ పాఠశాలను సీజ్ చేయాలి

కళ్యాణదుర్గం రూరల్: ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నడుపుతున్న పట్టణంలోని నారాయణ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని పాఠశాల ఎదుట ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ పర్మిషన్ లేకుండా 8, 9, 10వ తరగతులు నడుపుతున్నారన్నారు. ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతున్న నారాయణ పాఠశాలపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో ఎంతో ఒకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. జిల్లా అధికారులు స్పందించి నారాయణ విద్యాసంస్థలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ కార్యవర్గ సభ్యులు హనుమంతరాయుడు, ప్రకాష్, తాలూకా ప్రధాన కార్యదర్శి సాయికుమార్, ఉపాధ్యక్షులు సిద్దు, సందీప్, శివ, ప్రకాష్, సహాయ కార్యదర్శి మధు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం ధ్వంసం



మద్యాన్ని ధ్వంసం చేస్తున్న సెబ్ పోలీసులు

కంబదూరు: కంబదూరు సెబ్ పోలీసు స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన కర్ణాటక మద్యాన్ని సెబ్ అడిషనల్ ఎస్పీ రామకృష్ణ ఆధ్వర్యంలో ధ్వంసం చేశారు. శుక్రవారం స్థానిక చెరువు కట్ట ప్రాంతం వద్ద 3,100 టెట్రా ప్యాకెట్లను సెబ్ పోలీసులు ధ్వంసం చేయించారు. మద్యం విలువ సుమారు రూ.1,24,000 లక్షలున్నట్లు సెబ్ పోలీసులు తెలిపారు. కార్యక్రమంలో సీఐ మొహిద్దీన్‌బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

గంగ ఒడికి గౌరీపుత్రుడు

- ఘనంగా వినాయక నిమజ్జన శోభాయాత్ర

రాయదుర్గంటౌన్: పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో కొలువుదీరిన గణనాథుల నిమజ్జన శోభాయాత్ర శుక్రవారం సాయంత్రం వైభవంగా నిర్వహించా. పట్టణంలో 50కి పైగా వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. వివిధ ప్రాంతాల్లో కొలువుదీరిన వినాయక సేవా సమితి ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనాలపై గణనాథులను పట్టణంలో ఊరేగించారు. డీజేలు, డప్పులు, యువకుల కేరింతల నడుమ వినాయక నిమజ్జనం కొనసాగింది. అర్బన్ సీఐ లక్ష్మణ్ ఆధ్వర్యంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. విగ్రహాలను పట్టణ సమీపంలోని మొలకాల్మూర్జు చెక్‌పోస్టు వద్ద గల నాన్ చెరువులో నిమజ్జనం చేశారు. అలాగే వినాయక సర్కిల్ వినాయక సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం జరిగిన స్వామి లడ్డూ వేలంలో.. జూటూరు అరుణ్ అనే వ్యక్తి రూ.55,116కు లడ్డూ దక్కించుకున్నాడు. అంతకుముందు స్వామి పూలను వేలంలో కళ్యాణచక్రవర్తి రూ.10 వేలుకు దక్కించుకున్నాడు. కార్యక్రమంలో వినాయక సర్కిల్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ఊరేగింపు

కణేకల్లు: కణేకల్లులో శుక్రవారం వినాయక విగ్రహాల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఐదు రోజుల పాటు ప్రత్యేక పూజలందుకున్న గణనాథులను భక్తులు వైభవంగా ఊరేగించారు. డీజే ఆట, పాటలతో యువకులు నృత్యాలు చేస్తూ ఊరేగింపులో సందడి చేశారు. రామనగర్‌లోని హెచ్చెల్సీ వరకూ ఊరేగించి, విగ్రహాలను కాలువలో నిమజ్జనం చేశారు.

రూ.91 వేలు పలికిన 'లడ్డూ'

ఉరవకొండ: స్థానిక పదో వార్డు రంగావీధిలోని కాణిపాక వరసిద్ధి వినాయక ఉత్సవ సమితి ప్రతిష్ఠించిన వినాయకుడి లడ్డూ శుక్రవారం రికార్డు స్థాయిలో రూ.91,116 పలికింది. స్వామి లడ్డూను కొమ్మసాని మల్లికార్జున రూ.91,116కు దక్కించుకోగా, వెండి చైన్‌ను దాసరి మణికంఠ రూ31,116, శాలువాను పెద్దకోట్ల వన్నూర్ స్వామి సోదరులు రూ.17,116, కండువాను జీలకర రంగా రూ.6,116కు దక్కించుకున్నాడు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి వినాయక విగ్రహాన్ని నిమజ్జనానికి తరలించారు. కార్యక్రమంలో ఉత్సవ సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



రాయదుర్గంటౌన్: నిమజ్జనానికి తరలుతున్న, దశభుజ గణనాథుడు



రాయదుర్గంటౌన్: నిమజ్జనానికి తరలుతున్న ఎవర్‌గ్రీన్ గ్రూప్ మహా గణపతి







రాయదుర్గంటౌన్: గంగమ్మబావి వినాయకుడి ఊరేగింపులో భక్తులు, కణేకల్లు: విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం, ఉరవకొండ: వేలంలో స్వామి లడ్డూ, ఇతర వస్తువులను సొంతం చేసుకున్న భక్తులు

స్కిల్ స్కాంపై చర్చకు రమ్మంటే రచ్చకొచ్చారు!

- తప్పుచేశాడు కాబట్టే చంద్రబాబుకు కటకటాలు
- మీడియాపాయింట్‌లో విప్ కాపు రామచంద్రారెడ్డి



రాయదుర్గం: స్కిల్ స్కాంలో అడ్డంగా దొరికిపోయి రాజమండ్రి సెంట్రల్ జైల్లో ఊచలు లెక్కిస్తున్న నారా చంద్రబాబునాయుడు అవినీతిపై చర్చించేందుకు శాసనసభ సిద్ధంగా ఉందని, టీడీపీ ఎమ్మెల్యేలకు దమ్ము, ధైర్యం ఉంటే రచ్చకు కాకుండా చర్చకు రావాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి సవాల్ చేశారు. శుక్రవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద విప్ మాట్లాడారు.. శాసనసభలో రాష్ట్రానికి సంబంధించిన ముఖ్యమైన విషయాలు చర్చకు వస్తే మద్దతివ్వాల్సింది పోయి టీడీపీ ఎమ్మెల్యేలు బాయ్‌కాట్ చేయడం, సస్పెండ్ కావడం లాంటి కారణాలతో రచ్చచేస్తూ తప్పించుకుంటున్నారని ధ్వజమెత్తారు. స్కిల్ స్కాంపై వారు కోరినట్టే అసెంబ్లీలో చర్చించేందుకు బీఏసీలో కూడా నిర్ణయం తీసుకున్నామన్నారు. విలువైన సమయాన్ని దీనికే కేటాయించినా చర్చకు రాకుండా ఏదో ఓ కారణం చూపి పారిపోయారన్నారు. శాసనసభలో టీడీపీ ఎమ్మెల్యేలు వ్యవహరించిన తీరు పట్ల విరుచుపడ్డారు. స్పీకర్ పోడియం చుట్టుముట్టి గుండాలు, సైకోల్లా వ్యహరించారన్నారు. ఎమ్మెల్యే బాలకృష్ణ తీరు మరీ దారుణమన్నారు. సభలో మీసం మెలేయడం, తొడగొట్టడం, అసభ్యంగా ప్రవర్తిస్తూ విలువలకు పాతరేశాడన్నారు. గతంలో ఓ సభలో కూడా అమ్మాయి కనిపిస్తే ముద్దయినా పెట్టాలి..? కడుపైనా చెయ్యాలి..? అంటూ వ్యాఖ్యలు చేసి అభాసుపాలయ్యాడన్నారు. చంద్రబాబు తప్పుచేశాడు కాబట్టే కటకటాలపాలయ్యాడన్నారు. 40 ఏళ్ల రాజకీయ జీవితంలో చేసిన పాపాలు, నేరాలు, ఘోరాలు పండాయన్నారు. చేసిన తప్పుల నుంచి కాపాడుకోవడం సాధ్యం కాదన్నారు. సీఐడీ కస్టడికి ఇవ్వడం పట్ల రాష్ట్ర ప్రజలంతా సంతోషిస్తున్నారన్నారు. స్కిల్ స్కాం లో ఆధారాల సహా పట్టుబడి ఇప్పటికే చంద్రబాబు జైలు పాలయ్యాడని, ఇందులో మరి కొంతమందికి జైలు జీవితం తప్పదని విప్ కాపు ఎద్దేవా చేశారు. కొందరు విదేశాలకు పారిపోగా మరికొందరు ఇతర రాష్ట్రాల్లో తలదాచుకుంటున్నారన్నారు. ఫైబర్‌నెట్, రింగ్‌రోడ్డు వ్యవహారంలో కూడా దొంగలు దొరికిపోక తప్పదన్నారు.

యశ్వంత్‌పూర్-కారటిగి రైలుకు బళ్లారిలో నో స్టాప్



రాయదుర్గంటౌన్: రాయదుర్గం రైల్వే స్టేషన్ మీదుగా రాకపోకలు సాగిస్తున్న యశ్వంత్‌పూర్-కారటిగి ఎక్స్‌ప్రెస్ రైలు నెల రోజుల పాటు బళ్లారి రైల్వే జంక్షన్‌లో నిలుపుదల సౌకర్యం ఉండదని నైరుతీ రైల్వే హుబ్లీ డివిజన్ చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ అనీష్‌హెగ్డే తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అమృత్ భారత్ స్టేషన్ అభివృద్ధి పథకంలో భాగంగా బళ్లారి రైల్వేస్టేషన్‌లో మూడో ప్లాట్‌ఫారంలో పనులు జరుగుతున్నాయన్నారు. ఈ కారణంగా ఈనెల 24 నుంచి అక్టోబర్ 25 వరకూ యశ్వంత్‌పూర్-కారటిగి, కారటిగి-యశ్వంత్‌పూర్ రైళ్లు బళ్లారి రైల్వే స్టేషన్‌లో స్టాపింగ్ ఉండవన్నారు. ఈ నెల రోజుల పాటు ఈ రైలు రాయదుర్గం, ఓబుళాపురం, బళ్లారి బైపాస్ క్యాబిన్, బళ్లారి కంటోన్మెంట్ మీదుగా ప్రయాణిస్తుందన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం బళ్లారి కంటోన్మెంట్ స్టేషన్‌లో ఈ రైలు ఐదు నిమిషాల పాటు ఆగుతుందన్నారు. ఈ మార్పును బళ్లారి, రాయదుర్గం, హొస్పేట ప్రాంత ప్రయాణికులు గమనించాలన్నారు.

ఐచర్ బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు

కూడేరు: ఐచర్ వాహనం టైర్ పంక్చర్ కావడంతో అదుపు తప్పి బోల్తా పడిన ఘటన శుక్రవారం కూడేరు పోలీసు స్టేషన్ సమీపాన అనంతపురం-బళ్లారి ప్రధాన రహదారిపై చోటు చేసుకుంది. డ్రైవర్ నాగేంద్ర తీవ్రంగా గాయపడ్డాడు. ఉరవకొండ నుంచి వేరుశనగ బస్తాలను అనంతపురం తీసుకెళుతుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. క్షతగాత్రున్ని 108లో అనంతపురం తరలించారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని రాకపోకలకు ఇబ్బంది లేకుండా ఐచర్‌ను పక్కకు తీయించారు.

పకడ్బందీగా 'జగనన్న ఆరోగ్య సురక్ష'



బ్రహ్మసముద్రం మండలం గుండిగానిపల్లిలో సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



కుందుర్పి: సమీక్ష నిర్వహిస్తున్న అధికారులు

బ్రహ్మసముద్రం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకంలో భాగంగా ఇంటింటి సర్వే మండలంలో వేగవంతంగా సాగుతోందని మండల వైద్యాధికారి రాజేష్ కుమార్ తెలిపారు. శుక్రవారం మండంలోని భైరసముద్రం, గుండిగానిపల్లి, పాలవెంకటాపురం, సంతే కొండాపురం సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో వైద్య ఆరోగ్య సిబ్బంది, వలంటీర్ల ఆధ్వర్యంలో సర్వే చేపట్టి ప్రజల ఇంటి వద్దకే వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అవసరం ఉన్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్ పీలు ద్రాక్షాయణి, నాగమణి, ఏఎన్ఎం శశికళ, సుధ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కుందుర్పి: ఆరోగ్య సురక్ష పథకంపై శుక్రవారం స్థానిక గ్రామ సచివాలయంలో వివిధ శాఖల అధికారులు వైద్య సిబ్బందితో ఎంపీడీఓ వెంకటనాయుడు, సర్పంచ్ మారుతేశ్వరి సమీక్ష నిర్వహించారు. అనంతరం కుందుర్పిలో జగనన్న ఆరోగ్య సురక్ష కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేసి, పథకం ఆవశ్యకతను ప్రజలకు వివరించారు. 45 రోజుల పాటు నిర్వహించే కార్యక్రమంలో 105 రకాల మందులను ప్రజలకు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సత్యనారాయణశాస్త్రి, ఎంపీటీసీ హనుమంతరాయుడు, పంచాయితీ కార్యదర్శి మహబూబ్‌బాషా వార్డు సభ్యుడు మంజునాథ్, సచివాలయ, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

బెళుగుప్ప: మండలంలోని దుద్దేకుంట గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ రామచంద్ర ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా సచివాలయంలోని రికార్డులను పరిశీలించి సచివాలయ సేవలను విస్తృతం చేయాలన్నారు. అనంతరం జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను పరిశీలించి వలంటీర్లు, వైద్య సిబ్బందికి సలహాలు, సూచనలిచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ జగదీష్, సచివాలయ సిబ్బంది పార్వతి, దస్తగిరి, విమల, శ్రీలేఖ, వలంటీర్లు పాల్గొన్నారు.

కూడేరు: జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే మండలంలో చురుగ్గా సాగుతోంది. శుక్రవారం కమ్మూరు, గొటుకూరు, ఇప్పేరు గ్రామాల్లో ఇంటింటా వైద్య పరీక్షలను చేపట్టారు. కమ్మూరులో సీహెచ్ఓ జయ, ఏఎన్ఎం మాధవి, ఆశావర్కర్లు ఆదెమ్మ, శ్రీదేవి, మీనాక్షి ప్రతి ఒక్కరినీ పరీక్షించి వైద్య సమస్య ఉన్న వారిని గుర్తించి యాప్‌లో నమోదు చేశారు. అక్టోబర్ 3న గొటుకూరు, 5న ఇప్పేరు, 6న కమ్మూరులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను నిర్వహించనున్నట్లు సీహెచ్ఓ జయ తెలిపారు.



బెళుగుప్ప: దుద్దేకుంటలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రామచంద్ర



కూడేరు: కమ్మూరులో వృద్ధుడికి బీపీ పరీక్షిస్తున్న సీహెచ్ఓ జయ

నివాళి

గుమ్మఘట్ట: మండలంలోని తాళ్లకెర గ్రామంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు వడ్డే మోటయ్య (61)అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న రెడ్‌క్రాస్ సొసైటీ చైర్‌పర్సన్ కాపు భారతి గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అండగా ఉంటామని ధైర్యంగా ఉండాలని మృతుడి కుటుంబానికి భరోసా కల్పించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్ రాజేంద్రరెడ్డి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ మేకల శ్రీనివాసులు, నాయకులు పల్లక్కిరెడ్డి, వడ్డే మల్లికార్జున, బెస్త తిప్పేస్వామి, లోకేష్, బోయ బీమయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడాదుస్తులు, పరికరాల వితరణ

బెళుగుప్ప: మండలంలోని గంగవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎంపీటీసీ ఆమిద్యాల ప్రసాద్ క్రీడాదుస్తులు, పరికరాలను వితరణ చేశారు. శుక్రవారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు రాజశేఖరరెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ఉపాధ్యాయులతో కలసి విద్యార్థులకు సుమారు రూ.10,000 విలువ చేసే క్రీడా దుస్తులు, పరికరాలను అందజేశారు. ఇటీవల జరిగిన స్కూల్ గేమ్స్‌తో పాటు త్రోబాల్, హ్యాండ్‌బాల్ పోటీల్లో జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు క్రీడల్లో మరింత ప్రతిభను చాటాలని ఎంపీటీసీ, ప్రధానోపాధ్యాయుడు సూచించారు.

ముమ్మరంగా డ్రైనేజీ పనులు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని మొలకాల్మూరు రోడ్డులో డ్రైనేజీ నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఇప్పటిదాకా దాదాపు 60 శాతానికిపైగా పనులు పూర్తయ్యాయి. మొలకాల్మూరు రోడ్డుకు ఇరువైపులా దాదాపు 2 కిలోమీటర్ల మేర సీసీ డ్రైనేజీ నిర్మాణానికి రూ.1.70 కోట్లతో ఇటీవల ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి భూమి పూజ చేసి పనులను ప్రారంభించిన విషయం తెలిసిందే. ఆర్అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో కాంట్రాక్టర్ కొత్తపల్లి సత్యనారాయణ పనులు శరవేగంగా చేపడుతున్నారు. ఊరువాకిలి వద్ద నుంచి చెక్‌పోస్టు వరకు ఇరువైపులా డ్రైనేజీ నిర్మిస్తున్నారు. ప్రజల రాకపోకలకు అవసరమైన చోట్ల కల్వర్టులు సైతం నిర్మిస్తున్నారు. డ్రైనేజీ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న తరుణంలో ప్రభుత్వ విప్ ప్రత్యేక చొరవతో నిధులు మంజూరు కాగా క్షేత్రస్థాయిలో డ్రైనేజీ నిర్మాణం జరుగుతుండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



మొలకాల్మూరు రోడ్డులో డ్రైనేజీ పనులు

స్పెషల్ ఆధార్ శిబిరానికి స్పందన

కుందుర్పి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ వెంకటనాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక ఆధార్ శిబిరంలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ఎంపీడీఓ మాట్లాడుతూ శనివారం కూడా ఆధార్ స్పెషల్ క్యాంపు కొనసాగుతుందని ఆధార్‌లో పేర్ల తప్పులు, అడ్రస్ మార్పులు.ఆధార్ తీయించుకుని 10 ఏళ్లు నిండినవారి ఆధార్ అప్‌డేట్, చిన్న పిల్లలకు కొత్త ఆధార్ కార్డులు తీస్తున్నామన్నారు. ఆధార్ స్పెషల్ క్యాంప్ ఏర్పాటుపై మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

ఇరువర్గాల బైండోవర్

వజ్రకరూరు: మండలంలోని పీసీ ప్యాపిలి తండా గ్రామానికి చెందిన ఇరువర్గాలను పోలీసులు ఇన్‌చార్జ్ తహసీల్దార్ కేశవరెడ్డి ఎదుట హాజరు పరచి బైండోవర్ చేశారు. మూడు రోజుల క్రితం వినాయకచవితి నిమజ్జన కార్యక్రమంలో ఇరువర్గాలు గొడవకు దిగడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శుక్రవారం ఇరువర్గాలను ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఎదుట హాజరు పరచి బైండోవర్ చేశామని ఇన్‌చార్జ్ ఎస్ఐ వెంకటస్వామి తెలిపారు.

నేడు మంత్రి పర్యటన

బ్రహ్మసముద్రం: మండలంలోని తీటకల్లు గ్రామంలో శనివారం నిర్వహించనున్న వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష కార్యక్రమానికి రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖమంత్రి ఉషశ్రీచరణ్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని మంత్రి క్యాంపు కార్యాలయం నుంచి శుక్రవారం ఓ ప్రకటనను విడుదల చేశారు.

26న మండల సమావేశం

రాయదుర్గం రూరల్: మండల సర్వసభ్య సాధారణ సమావేశం ఈ నెల 26న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కొండయ్య శుక్రవారం తెలిపారు. ఎంపీపీ విద్యావతి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందన్నారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ, కో ఆప్షన్ సభ్యులు, సర్పంచులు, అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

సమస్యలు పరిష్కరించాలి

కూడేరు: తమ సమస్యలు పరిష్కరించాలని సమగ్ర శిక్ష ఉద్యోగులు శుక్రవారం కోరారు. ఉద్యోగులు శివప్రసాద్, రమణ, ఆదిలక్ష్మీ, కుంటిన్న, నాగమణి తదితరులు మాట్లాడుతూ న్యాయపరమైన డిమాండ్ల సాధన కోసం విజయవాడలో 25 నుంచి సత్యాగ్రహ దీక్ష చేపట్టాలని ఏపీ సమగ్ర శిక్ష ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగుల జేఏసీ పిలుపు నిచ్చిందన్నారు. ఈ మేరకు సెలవు మంజూరు చేయాలని ఎంఈఓ చంద్రశేఖర్‌ను కలిసి ఉద్యోగులు వినతి పత్రాన్ని అందజేశారు.

పట్టణాన్ని శుభ్రంగా ఉంచాలి

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలో శుక్రవారం స్వచ్ఛతే సేవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ వెంకటేశులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగ ఆయన శానిటరీ ఇన్‌స్పెక్టర్ హరిప్రసాద్‌తో కలసి మాట్లాడారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, ఇంటి వద్దనే తడి, పొడి చెత్తను వేరు చేయుట, ప్లాస్టిక్ కవర్ల నిర్మూలనపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వార్డు పారిశుధ్య, పర్యావరణ కార్యదర్శులు, మున్సిపల్ మేస్త్రీలు పబ్లిక్ హెల్త్ వర్కర్లు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం

కంబదూరు: బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందని సీడీపీఓ వనజ అక్కమ్మ సూచించారు. శుక్రవారం మండలంలోని ఐపార్సుపల్లిలో ఆర్డీటీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహాలనిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ చిన్న వయస్సులో వివాహాలు చేయడం వల్ల ఆడపిల్లలు మానసికంగా, శారీరకంగా తీవ్ర ఒత్తిడికి గురవుతారన్నారు. ప్రసవ సమయంలో తల్లీబిడ్డ ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందన్నారు. ఆడపిల్లలకు 18 సంవత్సరాలు, మగపిల్లలకు 21 సంవత్సరాలు నిండిన తర్వాతనే వివాహం చేయాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పద్మజ, ఆర్డీటీ సీఓ రామాంజనేయులు, ఉపాధ్యాయుడు గోవింద్, యానిమేటర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఈ-కేవైసీపై స్పెషల్ డ్రైవ్

వజ్రకరూరు: స్థానిక వ్యవసాయ కార్యాలయంలో శుక్రవారం పీఎం కిసాన్ ఈ-కేవైసీ, ఎన్‌పీసీఐ లింక్, ల్యాండ్ లింకేజీ తదితర అంశాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. కార్యక్రమాన్ని ఏఓ మధుకర్ పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమానికి రైతుల నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు. కార్యక్రమంలో వీఏఏలు, వీహెచ్ఏలు, ఎంపీహెచ్ఈఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

వేరుశనగ, మిరప పంట పరిశీలన

కళ్యాణదుర్గం రూరల్: కృషి విజ్ఞాన కేంద్రం కళ్యాణదుర్గం శాస్త్రవేత్తలు శుక్రవారం బ్రహ్మసముద్రం మండలంలోని బొమ్మగానిపల్లిలో వేరుశనగ, మిరప పంటలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ గ్రామంలో 16మంది రైతులకు వేరుశనగ, కంది, పెసర విత్తనలను షెడ్యూల్ ప్రణాళికలో అందజేశామన్నారు. ప్రస్తుతం పంటలను పరిశీలించి చీడపురుగుల బెడద నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రతి సంవత్సరం 30 మంది చొప్పున వంద మంది రైతులకు కేవీకే ఆధ్వర్యంలో వ్యవసాయ ఉద్యాన, పశువిభాగంలో సలహాలు, సూచనలు ఇస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ యుగంధర్, అధికారులు అభిషేక్, రాముునాయక్, ఉమాపతి, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థుల శ్రమదానం



కుందుర్పి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు స్వచ్ఛతే సేవా కార్యక్రమంలో భాగంగా శ్రమదానం చేసి కళాశాల ఆవరణలో పిచ్చి మొక్కలు తొలగించి పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఉమామహేశ్వర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.